క్లుప్తంగా

ఎట్టకేలకు సాగునీరు విడుదల



వంశధార ఎడమ కాలువ వద్ద రైతులు

సారవకోట: మండలంలోని వంశధార ఎడమ కాలువ ద్వారా గురువారం సాగునీటిని విడుదల చేశారు. బద్రి, లక్ష్మీపురం, గుమ్మపాడు తదితర గ్రామాల్లో రబీ పంటలు ఎండిపోతున్నాయి. వంశధార ఎడమ కాలువపై బైదాలాపురం సమీపంలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించడంతో దిగువకు నీరు వెళ్లకుండా సంబంధిత కాంట్రాక్టర్లు గతకొద్ది రోజులుగా అడ్డుకున్నారు. కాలువ నుంచి నీరు రాకపోవడంతో రబీ వరి పొలాలు ఎండిపోయిన విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి రైతులు తీసుకెళ్లారు. సంబంధిత కాంట్రాక్టర్లతో అధికారులు మాట్లాడి సాగునీటిని విడుదల చేశారు.

మహిళల రక్షణకే శక్తి యాప్



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ బాలకృష్ణ

నరసన్నపేట: ఆపద సమయంలో మహిళలు శక్తి యాప్‌ను ఉపయోగించి పోలీసులకు సమాచారం ఇవ్వొచ్చని శక్తి టీమ్ ఎస్‌ఐ వి.బాలకృష్ణ అన్నారు. స్థానిక ఎల్వీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ శక్తి యాప్ వినియోగం తీరును వివరించారు. అత్యవసర సమయాల్లో మహిళలకు శక్తి యాప్ రక్షణగా ఉంటుందన్నారు. మహిళలందరూ ఈ యాప్‌ను డైన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ యాప్ ద్వారా సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అప్రమత్తమై మహిళలను రక్షిస్తారన్నారు. విద్యార్థినులు శక్తి యాప్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు, ప్రతినిధులు డి.కోటేశ్వరరావు, వై.రాంబాబు, ఎస్ఎస్ఎస్ పీఓ పి.మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణారావు

పాతపట్నం: నాటుసారా రహిత పల్లెలుగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని పాతపట్నం ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు అన్నారు. మండలంలోని చాపరాయగూడ గిరిజన గ్రామంలో ఫారెస్ట్ అధికారులతో కలిసి నవోదయం-2.0 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేశానికి యువత అత్యుత్తమమైన సంపదని అన్నారు. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చాలామంది యువకులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. ఉమామహేశ్వరరావు, అరుణకుమారి, కృష్ణవేణి, ఆదిలక్ష్మి, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.17 వేల ఆర్థికసాయం



ఆర్థికసహాయం అందజేస్తున్న కమిటీ సభ్యులు

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామానికి చెందిన యువకులు జొన్నాడ గణేష్, గుగ్గిల ప్రసాద్ ఇటీవల పాలవలస వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వీరికి పురుషోత్తపురం గ్రామ యూత్ కమిటీ సభ్యులు రూ.17 వేల ఆర్థికసహాయాన్ని గురువారం అందించారు. దాతలు ముందుకు వచ్చి మరింత ఆర్థికసహాయం చేయాలని కోరారు. కమిటీ సభ్యులు ఉరజాన శ్రీరామ్మూర్తి, ఉరజాన రామకృష్ణ, ఉరజాన తేజేశ్వరరావు, వాసుదేవ రావు, గుణాపు సూర్యానారాయణ, లాస డేవిడ్, ఉరజాన ప్రవీణ్, పాత్రుని వర్ధన్, ఉరజాన నరేంద్ర, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందజేయనున్న సబ్సిడీ రుణాల మంజూరుకు ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పి.చంద్రకుమారి గురువారం తెలిపారు. బీసీల్లో వివిధ కేటగిరీలకు సంబంధించి మొత్తం 71 యూనిట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఇందులో శ్లాబ్-1 కింద రూ.2 లక్షల యూనిట్లకు బీసీ-ఎ 18, బీసీ-బి 8, బీసీ-డి 31, శ్లాబ్-2 కింద రూ.2 నుంచి రూ.3 లక్షల యూనిట్లకు.. బీసీ-ఎ 4, బీసీ-బి 2, బీసీ-డి 9, శ్లాబ్-3 కింద రూ.3 నుంచి రూ.5 లక్షల యూనిట్లకు.. బీసీ-ఎ 1, బీసీ-బి 1, బీసీ-డి 3 యూనిట్లు మంజూరైనట్లు వివరించారు. ప్రతీ యూనిట్‌కు 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, అన్ని ధ్రువపత్రాలతో సచివాలయం, ఏదైనా ఇంటర్ నెట్ కేంద్రంలో దరఖాస్తు చేయవచ్చన్నారు. సంబంధిత ఆన్‌లైన్ కాపీని ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఖాళీ జాగా.. వేసేయ్ పాగా!



సరుబుజ్జిలి నుంచి కొమనాపల్లి వెళ్లే రహదారిపై అక్రమ నిర్మాణాలు

- ఆర్‌అండ్‌బీ రోడ్లు కబ్జా
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

సరుబుజ్జిలి: కాదేదీ కబ్జాకు అనర్హం అన్నట్లు కొంత మంది అక్రమార్కులు వ్యవహరిస్తున్నారు. రోడ్డు పక్కన ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు ఆక్రమించి దుకాణాలు, పాకలు వేసేస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు ఉంటున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో ఆర్‌అండ్‌బీ రహదారుల పక్కన ఉన్న ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు.



అలికాం-బత్తిలి రోడ్డులో రొట్టవలస వద్ద నిర్మాణాలు

ఆక్రమణలకు గురైన రోడ్లు..

సరుబుజ్జిలి మండలంలోని సవలాపురం జంక్షన్, రొట్టవలస వద్ద, బూర్జ మండలం కొల్లివలస, లచ్చయ్యపేట జంక్షన్, వైకుంఠపురం, పొందూరు మండలం రాపాక ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ రహదారులను ఆక్రమించి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. దీని వలన రహదారులు పూర్తిగా కుచించుకుపోయి ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఉదయం, సాయంత్రం సమయంలో సరుబుజ్జిలి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. రహదారిపై దుకాణాలు, పాకలు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారు. దీని వలన వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆక్రమణల విషయమై స్థానికులు పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే దాఖలాలు లేవు.

నిబంధనలు బేఖాతర్...

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరు వైపులా కొంత స్థలం విడిచిపెట్టి నిర్మాణాలు చేయాలి. కానీ.. ఆయా ప్రాంతాల్లో మాత్రం నిబంధనలు వర్తించడం లేదు. కొంతమంది ఆక్రమణదారులు ఆర్‌అండ్‌బీ స్థలాల్లో తాత్కాలిక నిర్మాణాలు చేసి ఇతరులకు అనధికార విక్రయాలు చేస్తున్నారు. మరికొంతమంది షాపులు అద్దెకు ఇస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువలు కప్పేశారు



సరుబుజ్జిలి జంక్షన్‌లో నాలుగు వైపులా మురుగు నీటి కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. వర్షాకాలంలో మురుగునీటి కాలువలు చెత్తాచెదారంతో నిండి వరద నీరు రహదారిపై నిల్వ ఉంటుంది. ఆక్రమణల తొలగింపులో అధికారుల అలసత్వం వహిస్తున్నారు.

– ఇల్లాకుల శ్రీనివాసరావు, సరుబుజ్జిలి

ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాం



వాహనంతో బయటకు వస్తే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాం. రహదారులపై దుకాణాలు, పాకలు వేయడం వలన నడిచేందుకు కూడా స్థలం లేదు. ఆక్రమణల విషయమై ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– బద్రి రామారావు, ఏఎంసీ మాజీ చైర్మన్, పెద్దసవళాపురం

గతంలో నోటీసులు ఇచ్చాం..

రహదారుల ఆక్రమణదారులకు గతంలో నోటీసులు అందించాం. కొంతమేర ఆక్రమణలను తొలగించాం. ఇంకా ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే వాటిని కూడా తొలగిస్తాం.

– ఆంజేయ నాయక్, ఆర్‌అండ్‌బీ జేఈ, సరుబుజ్జిలి

హామీలు అమలు చేసేదెప్పుడు?

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తోపాటు కూటమి ముఖ్య నాయకులు అన్ని సభల్లోనూ సూపర్ సిక్స్ హామీలు అంటూ ప్రజలను నమ్మించారని గుర్తుచేశారు. చంద్రబాబు అధికారం చేపట్టి పది నెలలు అవుతున్నా హామీలు అమలుకు దిక్కులేకుండా పోయిందన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, 18 నుంచి 60 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500, రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఉచితం పేరుతో కూటమి నాయకులు ఇసుక దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. మద్యం కొత్త విధానం వలన వ్యాపార అనుమతులు పొందిన షాపుల యజమానులు గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇసుక, మద్యం వ్యాపారాలపై పెట్టిన దృష్టి.. ప్రజా సంక్షేమంపై లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పరిపాలన కొనసాగిస్తూ అమాయకులపై దాడులకు తెగబడుతున్నారన్నారు. దీంతో గ్రామాల్లో కక్షలు పెరుగుతున్నాయన్నారు.

జీఓ 84ను రద్దు చేయాలి

ఆమదాలవలస: మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న పాఠశాలలను, స్కూల్ ఎడ్యుకేషన్ నిర్వహణలోకి తీసుకువచ్చే అసంబద్ధమైన జీఓ 84ను రద్దు చేయాలని పురపాలక ఐక్య ఉపాధ్యాయ సంఘం నాయకులు బొడ్డేపల్లి రామకృష్ణ, వద్దాది గోపీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్ష్మీనగర్ ఉన్నత పాఠశాలలో గురువారం పురపాలక ఐక్య ఉపాధ్యాయ సంఘం, ఆమదాలవలస మండలం, పురపాలక పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఒకే డీఎస్సీలో సెలెక్ట్ అయినప్పటికీ ఆయా మున్సిపాలిటీల ప్రాతిపదికన సీనియార్టీలు నిర్ధారించారన్నారు. జీఓ 84 వలన ఆ సీనియారిటీలు తారుమారు అయిపోతున్నాయని, 100 కిలో మీటర్ల దూరానికి బదిలీ కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పాత విధానాన్నే కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో ఆమదాలవలస పురపాలక ఉపాధ్యాయులు కర్రి అప్పలనాయుడు, మెండ శ్యామలరావు, పెంటల కృష్ణ, జోగి అనంతరావు, బెహరా శ్రీనివాసరావు, గురుగుబెల్లి సుదర్శన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

కొత్తూరు: ఎండలు తీవ్రంగా ఉన్నందున గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు గురండి సర్పంచ్ బోర సింహాద్రి నాయుడు అన్నారు. గురండిలో బోరు తవ్వకం పనులను గురువారం ప్రారంభించారు. పంచాయతీలో అన్ని వీధుల్లోనూ నీటి ఎద్దడి లేకుండా దశల వారీగా చర్యలు తీసుకుంటామన్నారు.



బోరు తవ్వకం పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సింహాద్రి నాయుడు


ఆక్రమణ..



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని డొంకలబడవంజ వద్ద ఆక్రమణకు గురైన వంశధార కుడి ప్రధాన కాలువ. మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందించేందుకు నిర్మించిన వంశధార కుడి కాలువ గట్టు ఆక్రమణదారుల చేతుల్లో చిక్కిపోతుంది. ఈ కాలువ నాలుగో కిలో మీటరు స్కాట్‌పేట, 18వ కిలో మీటరు గోనేపాడు రోడు వద్ద ముగుస్తుంది. ఈ కాలువ గట్టుపై డొంకలబడవంజ, రావిచెంద్రి, యంబరాం, జగన్నాథపురం, శ్యామలాపురం, సిద్ధాంతం, సుమంతాపురం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఆక్రమణలున్నాయి. ఆక్రమణలు తొలగించాలని శివారున ఉన్న ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

రహదారిపైనే మట్టి పోగులు



ఈ చిత్రం ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి మెట్టక్కివలస సమీపంలోని రహదారిపై వేసిన మట్టి పోగులు. హడ్కో కాలనీ, వాంబే కాలనీ, మెట్టక్కివలస సమీపంలోని రహదారిపై పాత ఇళ్లను పడగొట్టి శిథిలాలను పోగులుగా వేశారు. ఈ రహదారిలో వెళ్లే ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతోంది. ఈ పోగులను తొలగించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

– ఆమదాలవలస

హుండీ ఆదాయం రూ.4.19 లక్షలు



పాతపట్నంలోని నీలమణిదుర్గ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం రూ.4,19,671 వచ్చిందని ఈఓ టి.వాసుదేవరావు గురువారం తెలిపారు. ఆమదాలవలస గ్రూప్ దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి రవికుమార్ పర్యవేక్షణలో హుండీ కానుకల లెక్కింపు జరిగిందన్నారు. 37 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. లెక్కింపులో వేంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

– పాతపట్నం

దుర్వాసనతో అవస్థలు



ఈ చిత్రం కొత్తూరు మండలం మాకవరంలో పూడికలు, పిచ్చిమొక్కలతో నిండిపోయిన మురుగు నీటి కాలువ. దుర్వాసనతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. సుమారు ఏడాది నుంచి పూడికలు తీయలేదు. మురుగునీటి నిల్వ ఉండటంతో దుర్వాసనతోపాటు ప్రజలు పలు రోగాల బారిన పడుతున్నారు. కాలువల్లో పూడికలు తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన జి.ప్రేమకుమార్, తదితరులు తెలిపారు. ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలు స్పందించి కాలువల్లో పూడికలు తొలగించాలని కోరారు.

– కొత్తూరు

గిరిజనుల ఆందోళన



కొండ చీపుర్లతో ఆందోళన చేస్తున్న గిరిజన మహిళలు, నాయకులు

- అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలి
- గొట్టిపల్లిలో కొండ చీపుర్లతో నిరసన

కొత్తూరు: గిరిజనులు పండిస్తున్న అటవీ ఉత్పత్తులను గిరిజన కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి ఆదుకోవాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్వహించనున్న ఆదివాసీ చైతన్య యాత్రలో భాగంగా గురువారం కొత్తూరు మండలం గొట్టిపల్లి గిరిజన గ్రామంలో కొండ చీపుర్లతో గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిమ్మక అప్పన్న, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాదరావు మాట్లాడారు. అటవీ ఉత్పత్తులను జీసీసీ కొనుగోలు చేయకపోవడంతో గిరిజనులు దళారీల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులు పండించిన 21 రకాల పంటలను జీసీసీ కొనుగోలు చేయాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. జిల్లోని 12 మండలాల్లో లక్షా యాభై వేల గిరిజన కుటుంబాలు ఉన్నాయన్నారు. గిరిజనులను అన్ని విధాలుగా ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని విమర్శించారు. సీతంపేట ఐటీడీఏ పీఓ స్పందించి గిరిజన ఉత్పత్తులను జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం నాయకులు సవర మోహన్‌రావు, జమ్మయ్య, సూర్యారావు, నాగన్న, నగేష్, ఎన్.రత్నాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పాతపట్నం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు



సారవకోట: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కామాక్షి



సరుబుజ్జిలి: రొట్టవలస జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జానకి

అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారులు అన్నారు. పోషణ్ బీ - పడాయి బీ కార్యక్రమంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. చైల్డ్‌డెవలప్‌మెంట్, హెల్త్, న్యూట్రిషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆధార్ శిల, నవచేతన్, నూతన విద్యా విధానంపై అవగాహన కల్పించారు. అధికారులు, ఎంఈఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ సీడీపీఓ లావణ్య

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

పాతపట్నం: అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్ 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పరీక్షల్లో పాతపట్నం ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు వైస్ ప్రిన్సిపాల్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. 6వ తరగతికి చెందిన జి.కీర్తన, సి.హెచ్.బెనర్జి, సి.హెచ్.వికాస్, 7వ తరగతికి చెందిన ఎ.బాలచంద్ర, 9వ తరగతకి చెందిన ఉమాశంకర్ ప్రదాన్‌లు బంగారు పతకాలు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పశువుల అక్రమ రవాణాపై కేసు

జలుమూరు: పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు జలుమూరు ఎస్ఐ అశోక్‌బాబు గురువారం తెలిపారు. చల్లవానిపేట జంక్షన్ వద్ద రెండు వ్యాన్లలో 19 దూడలను ఎటువంటి అనుమతులు లేకుండా తరలించడాన్ని గుర్తించామన్నారు. మండలంలోని టెక్కలిపాడుకు చెందిన వాన మోహన్‌రావు, అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన ఎ.డి.వి.నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశామన్నారు. దూడలను రణస్థలం గోశాలకు తరలించామన్నారు.

మంచు దెబ్బ..



మాడిపోయిన మామిడి పూత

పాతపట్నం: మామిడి, జీడి తోటల పూత కొన్నచోట్ల ఆశాజనకంగా ఉన్నప్పటికీ మంచు ప్రభావం వల్ల పూత ఉంటుందో, లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పాతపట్నం, ప్రహరాజపాలెం, రంకిణీ, కొదూరు, దాసుపురం, రామన్నగూడ, బైదలాపురం, కొమ్మలగూడ, శిష్టుజగన్నాథపురం, బద్దుమర్రి, బోమ్మిక, లాబర, గంగువాడ, టి.కొత్తూరు, కొనంగి, గిట్టంగి, గంగువాడ, గోపాలపురం, పెద్దమల్లిపురం, ఎస్.ఎస్.మనుగు, బొన్ని తదితర గ్రామాల్లో 10 వేల ఎకరాలకు పైగా జీడి, మామిడి తోటలున్నాయి. ఇటీవల మంచు ఎక్కువగా కురవడంతో పూత దెబ్బ తింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూత నిలబడడానికి, వచ్చిన పూత మాడకుండా ఉండేందుకు ఇప్పటినుంచే మందులు కొడుతున్నారు. అయినప్పటికీ ఎలా ఉంటుందోనని దిగులు చెందుతున్నారు. ఉద్యానవనశాఖ అధికారులు స్పందించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని మామిడి, జీడి రైతులు కోరుతున్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడాలి



పొందూరు: మాట్లాడుతున్న హరిప్రసన్న, కంటయ్య

పొందూరు: జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ సమన్వయకర్త పూజారి హరిప్రసన్న, తాడివలస ఉన్నత పాఠశాల హెచ్ఎం బల్ల కంటయ్య తెలిపారు. గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతరించే పక్షులలో పిచ్చుకలు ఉండడం ఆందోళనకు గురిచేసే విషయమన్నారు. వ్యవసాయ దిగుబడులకు పిచ్చుకలు సహాయకారిగా ఉంటాయన్నారు. పిచ్చుకలను కాపాడుకుంటే జీవవైవిధ్యాన్ని కాపాడుకోవచ్చని డ్రాయింగ్ టీచర్ రాధాకుమారి వేసిన చిత్రాలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు గోపాలశెట్టి సాయికుమార్, రావాడ పాపారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవరాశులను కాపాడాలి

పాతపట్నం: అంతరించిపోతున్న పిచ్చుకల జాతిని సంరక్షించాలని, జీవరాశులను కాపాడాల్సి బాధ్యత అందరిపైనా ఉందని పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.వైకుంఠరావు అన్నారు. గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులకు పిచ్చుకల చిత్రలేఖన పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. హెచ్ఎం మాట్లాడుతూ అడవుల నిర్మూలన, సెల్ టవర్లు, వాతావరణ కాలుష్యం కారణంగా పిచ్చుకల జాతి రోజు, రోజుకూ కనుమరుగు అవుతుందన్నారు. సైన్స్ ఉపాధ్యాయుడు ఎస్.టి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆమదాలవలస/ పాతపట్నం: 9010177724
నరసన్నపేట: 9912220367
Office mail : sklmadvt@gmail.com